# బేరగాడు

"చక్రకేళి! చక్రకేళి! ఆలసించిన ఆశాభంగం రెండు డజన్లే మిగిలాయి – ఎవరికండి అరటి పళ్ళు?" తుఫాను స్పీడుతో పయనిస్తున్న ఈస్టుకోస్టులో అదే వేగంతో వ్యాపారం చేస్తున్నాడు అతను.

పుల్లారెడ్డి అతని వంక చూశాడు. మనిషి బాగానే కనిపిస్తున్నాడు. స్వచ్ఛమైన తెలుగు మాట్లాడుతున్నాడు. రైల్లోనే అతను అరటి పళ్ళ వ్యాపారం చేసేస్తున్నాడు.

"డజను ఎంత?" పుల్లారెడ్డి పక్క కూర్చున్న ఓ ముత్తయిదువు అడిగింది.

"ఐదు రూపాయలు." తక్కున చెప్పాడు.

"రెండు రూపాయలకిస్తావా" ఆమె సీరియస్‌గా అడిగింది.

"మీరు నాకిప్పిస్తే ఇప్పుడే ఓ వంద డజన్లు కొనుక్కుంటాను. మాకే డజను నాలుగుయాభై పడింది." అతను చెప్పాడు.

ముత్తయిదువ మొఖం చిన్న బుచ్చుకుని మొహం తిప్పేసుకుంది.

"ఎవరికండి అరటిపళ్లు ?" అతను ముందు కెళ్ళిపోయాడు.

పుల్లారెడ్డి నవ్వుకున్నాడు . తన పక్క సీటామెకు బేరం గురించి బొత్తిగా తెల్సినట్లు లేదు. అదే తనయితేనా తన స్నేహితులందరు తన ఇంటి పేరు 'జి'కి గ్రేట్ అని అర్థంచెబుతారు వాళ్లకు ఏ వస్తువు కావల్సి వచ్చినా తన్ని వెంటబెట్టుకుపోతారు.

"చక్రకేళి!" అంటూ అరుచుకుంటూ అతను మళ్లీ ఇటు వచ్చాడు.

ఈ సారి పుల్లారెడ్డి ఊరుకోదల్చుకోలేదు. తన ప్రతిభను అందరికి చూపదల్చుకున్నాడు-దగ్గరికి రమ్మని పిలిచాడు.

"ఏం బాబూ! నీ పేరేంటి?"

"అప్పల నర్సన్న అండి. అరటి పళ్ళు కొంటారా?"

"పేరు బాగుందే, – ఏమైనా మొక్కుబడి ఉండి పెట్టిందా మీ అమ్మ?"

"అవునండి – చక్రకేళి బావుందండి – ఇంకో డజనే ఉంది – కొనండి-"

"ఊఁ!ఎక్కడ నుండి వస్తున్నావు?"

"ఏలూరండి – మళ్ళీ రిటర్న్ లో ఇంకో ట్రైన్ పట్టుకు ఎళ్ళిపోతానండి. ఇంతకు తమరికి చక్రకేళి కావాలా వద్దాండి?"

"అది నీ మీద ఆధారపడి ఉంటుంది."

"అయబాబోయ్! కొనే వాళ్ళు తమరు – నేను అమ్ముకునే వాణ్ణి. తమరడిగితే ఇస్తాను."

"పళ్ళు బాగా మాగిపోయినట్లున్నాయి."

"అవునండి – నోట్లో వేసుకుంటే కరిగిపోతాయి, అమృతమంత తియ్యగా ఉంటాయి."

"నిజమే! ఈరోజే వాడెయ్యాలి."

"అసలు ఒకటి తింటే – మిగతావి మిగల్చరండి. అన్నీ అయిపోతాయి – ఇంటికి ఓ డజను పట్టుకుపోండి అమ్మగారు సంతోషిస్తారు."

"కాని మువ్విచ్చే ధరకి కొంటే నాకు ఇవ్వాళ అన్నం కూడా పెట్టదు. పస్తే!"

"అయబాబోయ్! అంత మాటనకండి - ఎంత గావాలో అడగండి."

"ఎంతకిస్తావో నువ్వే చెప్పు !"

"కొనే వాళ్లు తమరు - తమరడగాలి -"

"ఇచ్చే వాడివి నువ్వు - నువ్వే చెప్పు"

"సరే తమరికి కాబట్టి నాలుగున్నరకిస్తాను."

"నాకొద్దు- నిన్ననే ఓ డజను పళ్ళు కొన్నా!"

"అయితే ఏమండి - అవి అలాగే ఉంటాయా?"

"మా ఆవిడ రెండు రూపాయలకు కొంది."

"అవి చక్రకేళి అయ్యుండవండి - ఇంకేదో అయ్యుంటుంది."

"లేదు. ఇంత కంటే బాగున్నాయి."

"ఇంతకి ఎంతిస్తారో చెప్పండి -"

"అదటుంచు ఇంకాసేపటికి ఇవన్నీ కుళ్ళిపోయేట్లున్నాయి - ఇంటికి పోయేదాకా ఉంటాయో ఉండవో -"

"తమరు అటువంటి అనుమానాలు పెట్టుకోవద్దు కుళ్ళిపోతే రేపు డబ్బు వాపసు ఇచ్చేస్తాను."

"మళ్ళీ నిన్ను పట్టుకోవడానికి నేను ఏలూరు దాకా రావాలి? ఏగాని" - వాక్యం తుంచేశాడు పక్కనున్న ఆమెను చూసి.

"ఆఖరి మాట నాలుగురూపాయలిప్పించండి."

"ఇచ్చే వాణ్ణేమో కాని - నా దగ్గర రెండు రూపాయలే ఉన్నాయి." జేబు చూసుకుంటూ అన్నాడు.

"మరింకేం - ఓ ఆరు తీసుకుపోండి." అతను ఉత్సాహంగా తుంచి ఇవ్వబోయాడు.

"అబ్బే! ఒకట్లు, రెండ్లు, ఆర్లు కొనడం మా వంశంలో లేదు, కొంటే డజను, లేకపోతే లేదు. ఈ రెండూ తీసుకుని డజను ఇచ్చెయ్యి."

"పిల్లా జెల్లా కలవాడిని నష్టానికి అమ్ముకోమంటారా?" కోపంగా అడిగాడు నర్సన్న అప్పల.

"చూడూ, వ్యాపారం అన్న తర్వాత ఒకచోట లాభం వస్తుంది. ఇంకో చోట నష్టం వస్తుంది. నువ్వు ఇంకాసేపాగితే ఇవి పూర్తిగా కుళ్ళిపోతే బయట పారెయ్యాలి. అప్పుడు ఈ రెండు రూపాయలు కూడా నీకు రాదు". విశదీకరించాడు పుల్లారెడ్డి.

బండి స్లో అయింది. స్టేషన్ వస్తున్నట్లుంది.

"సరే తీసేసుకోండి - లేచిన వేళ బాగాలేదు." సణుక్కుంటూ వెళ్లిపోతున్నాడు అప్పల నర్సన్న పండ్లు యిచ్చి డబ్బులు జేబులో వేసుకొని-

"నీకంత కష్టంగా ఉంటే తీసేసుకోఫో.?" బెట్టుగా అన్నాడు పుల్లారెడ్డి.

"తమరిలాంటి బేరం రోజు కొకటి తగిల్తే చాలు -" అతను మాయమైపోయాడు.

విజయగర్వంతో పుల్లారెడ్డి కంపార్టుమెంటులోని వ్యక్తుల వంక చూశాడు. తర్వాత ఆమె వంకచూసి ఆమెకిచ్చాడు.

"తీసుకోండి - మీకోసమే కొన్నా!"

"అయ్యో! మీరింటికి తీసుకుపోరా?"

"అబ్బే! నాకెందుకండి? మీకిందాక ఇవ్వనన్నాడని బేరం చేశాను. తీసుకోండి."

"థాంక్స్!" రెండు రూపాయలిచ్చింది-పండ్లు తీసుకొని

విజయవాడలో రైలు ఆగింది పుల్లారెడ్డి తెనాలి పోవాలి. విజయవాడలో కూడా చిన్న పని ఉంది. ఇక్కడ ఓ చాకు లాంటి కుర్రాడు పనిచేస్తున్నాట్టా. తనమ్మాయికి చూద్దామనే ఉద్దేశం ఉంది. ముందస్తుగా ఆ అబ్బాయిని చూద్దామని అనిపించింది-రైలు దిగాడు.

ఈ రిక్షా వాళ్లతో పుల్లారెడ్డికి చాలా అనుభవం ఉంది. పరాయి ఊళ్లో కొత్త వాళ్ళని పసిగడితే చాలు,చెబుతారు. కాని నడిచిపోతాడతను ఎక్కువకావలసిన-రైలు మిస్సుకావచ్చు. రిక్షాలో పోయి తొందరగా వచ్చేద్దామనుకున్నాడు. ఉన్న సంచీని చేతిలో పట్టుకుని స్టేషన్ బయటకు వచ్చాడు.

ఓ రిక్షా వాడు వెంటబడ్డాడు.

"ఎక్కడికి పోవాలండి? రిక్షా ఎక్కండి."

"గాంధీనగరంట – అక్కడికి తీసుకుపో( !" కోపంగా అన్నాడు.

"ఐదు రూపాయలిప్పించండి."

పుల్లారెడ్డికి కొన్ని గాఢ అభిప్రాయాలున్నాయి. రిక్షా వాళ్ళు చెప్పిన దాంట్లో సగానికి బేరం ఆడాలని, వాళ్ళు చచ్చి గీపెట్టినా సగం కంటే ఇవ్వకూడదని.గమ్యం చేర్చే బాధ్యత రిక్షావాడిపైనపెట్టేయ్యాలని, వాడు ఎంత తిప్పినా మాట్లాడుకున్న డబ్బు మాత్రమే ఇవ్వాలని.

"ఐదు రూపాయలా ! ఏమయ్యా నే ఎలా కనిపిస్తున్నాను నీకు?"

"అయ్యా !తమరిదే బోణీ! అండి. తమరు బేరం చేస్తే నాకు రోజల్లా ఇంతేనండి." రిక్షావాలా చెప్పాడు.

"నాకూ నీదే బోణీ.పొద్దున్నే ఎక్కువ డబ్బులిచ్చి నష్టపోయాననుకో – ఈ రోజల్లా నాకలాగే గడుస్తుంది." గడుసుగా చెప్పాడు పుల్లారెడ్డి.

"కష్టం చేసుకుని బతుకుతామండి తమలాంటి గొప్పోళ్లు ఇవ్వకపోతే మాకెలా గడవాలండి - రూపాయికి టీ నీళ్ళు కూడా రావడం లేదండి."

"నిజమే కాని ఒక్క సారి బేరంలోనే నీ సంసారమంతా గడిచిపోవాలంటే ఎలా? ఓ నాలుగు సార్లు రిక్షా తొక్కితే ఎవ్వరికీ ఇబ్బంది ఉండదు."

"ఇంతకీ తమరేమిప్పిస్తారండి?"

"రెండున్నర చేసుకో – అంత కంటే నయా పైసా ఎక్కువివ్వను. వస్తేరా! లేకపోతే ఫో (!" కోపంగా అని నాలుగడుగలు ముందు కేశాడు.

"నాలుగు – కిలో బియ్యం కూడా రాదండి."

"ఉహూ (!" తల అడ్డంగా ఊపాడు.

"పోన్లే మూడున్నర, మూడు రూపాయలిప్పించండి". రిక్షా వాడు ప్రాధేయపడుతూ వెంటపడ్డాడు.

"చూడు నాది మాటంటే మాటే నేను నిఖార్స యిన మనిషిని. ఒక మాటన్నా నంటే నూరు అయినా - ఆరు నూరైనా జరిగి తీరాల్సిందే ఒక్క పైసా తక్కువివ్వను". ధృఢంగా చెప్పాడు.

"పొట్ట చేత్తో పట్టుకుని రోడ్డు మీద పడ్డవాళ్లం – అలాగేకానివ్వండి – తమ దయ." అయిష్టంగా

తుండుగుడ్డతో సీటు దులిపి రిక్షా పుల్లారెడ్డి ముందు ఆపాడు.

పుల్లారెడ్డి సింహాసనం అధిరోహించి నంత ఆనందం గా మీసాలు మెలేస్తూ చిద్విలాసంగా రిక్షాలో కూర్చుంటే సామాన్యుడి బతుకులా భారంగా రిక్షా కదిలింది.

"హనుమంతుడి ముందా కుప్పిగంతులు ? బేరంలో మన్ని మించినవాడింకా పుట్టలేదు" స్వగతంగా అనుకున్నాడు.

సరిగా సర్దుకుని కూర్చున్నాడో లేదో దాదాపు కొన్ని వందల గజాలు కూడా పోకుండానే రిక్షా ఆగిపోయింది.

"ఏం రిక్షా ఆగింది ? చైను ఊడిందా ?" వాచి చూసుకుంటూ చికాకు ప్రదర్శించాడు.

"అదేం కాదు బాబయ్యా తమరి ఆఫీసు – వచ్చిందండి" వినయంగా చెప్పాడు చెయ్యి చాస్తూ రిక్షావాడు.

పుల్లారెడ్డి ఆ ఎత్తైన భవనాన్ని పరిశీలించాడు, నిశితంగా బోర్డు స్పష్టంగా కనిపిస్తూ ఉంది. రిక్షా దిగి అనుమాన మొచ్చి వెనక్కి తిరిగి చూశాడు . దగ్గర్లోనే రైల్వేస్టేషను గట్రా కనిపిస్తున్నాయి. తొందరగా వచ్చింది గమ్యం!

"అయ్యా !రెండున్నర రూపాయిలిస్తే ఇంకో బేరానికి వెళ్ళాలి . ఆయన పిలుస్తున్నాడు – బేగీ ఇప్పియ్యండి." రిక్షావాడు తొందర చేశాడు దూరంగా గంప ఎత్తుకున్న ఆసామిని చేత్తో చూపిస్తూ.

జేబులోంచి డబ్బులు తీస్తూ ఆ వైపు చూసి ఉలిక్కి పడ్డాడు – చక్రకేళి అబ్బి ఇకిలిస్తున్నాడు.

ఐదు నిమిషాల నడక ఉన్న స్టేషన్ వంక చూస్తూ బిగుసుకుపోయాడు గొప్ప బేరగాడైన ది గ్రేట్ పుల్లారెడ్డి.

12 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 19-4-89

